
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 23 డిసెంబరు 2024 | 5



100 వరకు బెల్టు షాపులు

- ఎక్కడపడితే అక్కడ లూజు విక్రయాలు
- అడ్డూఅదుపు లేకుండా అమ్మకాలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- మందుబాబుల ఆగడాలకు అంతేలేదు..

మండపేట,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో ఆరు మద్యం దుకాణాలు, మండపేట రూరల్‌లో ఐదు, కపిలేశ్వరపురం మండలంలో నాలుగు, రాయవరం మండలంలో నాలుగు దుకాణాలు ఉన్నాయి. వాటికి సంబంధించి అనుబంధంగా 100 వరకు బెల్టు షాపులు ఉన్నాయి. దీంతో ఏ సమయంలోనైనా మందు దొరుకుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం పది గంటలకు తెరవాల్సిన మద్యం దుకాణాలు ఉదయం 8గంటలకే తెరిచేస్తున్నారు. మద్యం దుకాణాల వద్దనే మందు బాబులు లూజు మద్యం తాగేస్తున్నారు. నెలవారీ మామూళ్లు ఇస్తున్నాం..మాకేంటి అనే ధోరణిలో మద్యం వ్యాపారులు ఉన్నారు.

11 గంటలు దాటినా..

మండపేట పట్టణంలో ఉన్న బార్‌లు రాత్రి 11 గంటలు దాటుతున్నప్పటికి కూడా మూయడం లేదు. అర్ధరాత్రి వరకు బార్‌లు మద్యం దుకాణాలు తెరిచి ఉంచటం వల్ల మందుబాబులు మద్యం సేవించి చేసే ఆగడాలు అన్నీఇన్నీ కావు. చీకటి పడితే చాలు రహదారుల వెంబడి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మద్యం దుకాణాల వద్ద బారులు తీరి మందుబాబులు రెచ్చిపోతున్నారు. బెల్టు దుకాణాలు నిర్వహించకూడదని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసినా ఎక్కడా భయపడడం లేదు. దర్జాగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. ఇక రాత్రయితే మందుబాబుల ఆగడాలకు అంతేలేకుండా పోతోంది. అర్ధరాత్రులు కూడా కొన్నిచోట్ల మందు దొరకుతుండడంతో బైక్‌లపై తాగి ప్రయాణం చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.



ఊరూరా బెల్టు

- ఏరులై పారుతున్న యానాం మద్యం
- పల్లెల్లో జోరుగా బెల్టు షాపులు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ సిబ్బంది

ఎక్కడైనా బెల్టు నిర్వహిస్తే తాట తీస్తాం. ఇది సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హెచ్చరిక. అయితే ఎక్సైజ్ అధికారుల మామూళ్ల మత్తులో ఈ హెచ్చరికలకు విలువ లేకుండా పోయింది. ఐ.పోలవరం మండలంలో మద్యం అమ్మకాలు మూడు షాపులు..ముప్పై బెల్టు దుకాణాలుగా కొనసాగుతున్నాయి. యానాం మద్యం ఇక్కడ ఏరులై పారుతోంది. కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉండటంతో గోదావరి పాయలు దాటి పడవల ద్వారా ఆంధ్రాకు తరలివస్తోంది.



కొమరగిరి మద్యం దుకాణం

విచ్చలవిడిగా యానాం మద్యం

ఐ.పోలవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):మత్స్యకార గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు ఎక్కువగా ఉండటంతో పాటు యానాం మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పెత్తందారీ వ్యవస్థ ద్వారా లక్షల్లో వేలం పాటలు నిర్వహించి బెల్టు దుకాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ సిబ్బంది పట్టించుకోకపోవడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. బెల్టు షాపులు అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారుల మౌనం ప్రజల పాలిట నరకంగా మారింది. అయితే అక్కడక్కడా దాడులు నిర్వహించినట్టు నాటకీయ ఫక్కీలో కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్న ఎక్సైజ్ సిబ్బంది తీరుకు ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో 13 అధికారిక మద్యం దుకాణాలున్నాయి. వీటికి అనుసంధానంగా నిబంధనలకు విరుద్ధంగా సుమారు 30 మెగా మద్యం బెల్టు షాపులు వేలం పాటల ద్వారా ఏర్పాటు చేశారు.



జి.మూలపొలం గోదావరి రేవు వద్ద బెల్టు దుకాణం



ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు..

షాపు యజమానులు ఎమ్మార్పీ కంటే అధికంగా బెల్టు నిర్వాహకులకు విక్రయిస్తున్నారు. అక్కడ మరింతగా ధర పెంచి మద్యాన్ని విక్రయించడంతో కొనుగోలుదారులు దోపిడీకి గురవుతున్నారు. జి.మూలపొలం గోదావరి పడవ దాటింపు రేవు వద్ద బెల్టు షాపు ద్వారా పట్టపగలే మద్యం విక్రయిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో ఈ వ్యవహారమంతా జరుగుతోందని బహిరంగంగానే జనం వ్యాఖ్యానిస్తున్నారు. ముమ్మిడివరం మండలం కొత్తలంకలో గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడిపిన షాపులోనే ఇప్పుడు బెల్టు షాపు ఏర్పాటు చేసి దర్జాగా మద్యం విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా తమకేమీ పట్టనట్టు అధికారులు వ్యవహరించడం వెనుక రహస్యం అందరికీ తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అంశంపై స్పందించాలని పలువురు కోరుతున్నారు.

మూడు ర్యాంపులకు టెండర్లు

- నేటితో ముగియనున్న ఇసుక టెండర్ల దాఖలు గడువు
- నిబంధనలు అమలుపై కాంట్రాక్టర్ల మల్లగుల్లాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ టెండరు నోటిఫికేషన్‌జారీ చేశారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని మూడు కీలకమైన ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలు, లోడింగ్, అన్‌లోడింగ్, స్టోరేజ్ పాయింట్ వద్ద ఇసుక నిల్వ చేసేందుకు టెండర్లు పిలిచారు. అయితే ఈ షార్ట్ టెండర్ల నోటీసులో అధికారులు విధించిన నిబంధనల పట్ల కాంట్రాక్టర్ల నుంచి నిరసనలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక ర్యాంపులు నిర్వహించిన కాంట్రాక్టర్లకే అనుకూలంగా ఉండే విధంగా నిబంధనలు రూపొందించడం పట్ల పలువురు ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని రావులపాలెం మండలం గోపాలపురం(మల్లేశ్వరం) ర్యాంపులో 74,700 మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వేందుకు టెండరు జారీ చేశారు. అదే విధంగా ఆత్రేయపురం మండలం అంకంపాలెం ఇసుక రీచ్‌లో 1,47,810 టన్నుల ఇసుకను తీసేందుకు, రావులపాలెం మండలం పొడగట్లపల్లి-ఏ ర్యాంపులో 3,74,475 మెట్రిక్ టన్నుల ఇసుకను తీసేందుకు టెండరు తయారు చేశారు. రీచ్‌లలో ఉన్న ఇసుక మాన్యువల్ తవ్వకం లోడింగ్, నిల్వ కేంద్రం వద్దకు రవాణా, స్టాకు పాయింట్ వద్ద లోడింగ్ కోసం గోపాలపురం రీచ్‌కు ఆహ్వానించారు. అదే విధంగా అంకంపాలెం, పొడగట్లపల్లి రీచ్‌లకు ఇసుక సెమిమెకనైజ్ తవ్వకం, ఇసుక రీచ్‌లలో లోడింగ్, స్టాకు పాయింట్ వద్ద ఏర్పాట్లు కోసం సీల్డు టెండర్లను పిలిచారు. ఈ నెల 20వ తేదీన జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఇందుకోసం పబ్లికేషన్ విడుదల చేసింది. అయితే పొడగట్లపల్లి ర్యాంపులో కాలపరిమితిని విధించకుండానే ఆదేశాలు జారీ చేయడం అనుమానాలు రేకెత్తిస్తోంది. దీనిలో భాగంగా టెండర్ల షెడ్యూల్‌లో సూచించిన నిబంధనలు గత ప్రభుత్వ హయాంలో ఇసుక రీచ్‌లలో పాల్గొన్నవారికి మాత్రమే అనుకూలంగా ఉండే విధంగా నిబంధనలు ఉన్నట్టు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. 2021-22 నుంచి 2023-24 మధ్య కాలంలో 5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక పరిమాణాన్ని వెలికితీతతో కలిపి రూ.3.50 కోట్లు విలువైన ఇసుక మైనింగ్ పనులు చేపట్టి ఉండాలనేది ఒక నిబంధన. టెండరు దాఖలు చేసేవారు తప్పనిసరిగా యంత్ర పరికరాలకు సంబంధించి సాక్ష్యాలను సమర్పించాలి. ఇసుక తవ్వకంలో అనుభవ ధ్రువీకరణపత్రం ఇవ్వాలి. పరికరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, బీమా సర్టిఫికెట్లతో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా అందజేయాలని ఆ నిబంధనల్లో పేర్కొన్నారు. బిడ్‌లు సమర్పణ గడువు తేదీలోగా ఏదైనా సీపీఎస్‌యూ, రాష్ట్ర పీఎస్‌యూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు బిడ్డర్‌ను బ్లాక్ లిస్టులో ఉంచకూడదు అనే నిబంధనను కూడా పేర్కొన్నారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో కనీస సగటు వార్షిక టర్నోవర్ ఐఎస్‌ఆర్ రూ4 కోట్లను కలిగి ఉండాలి. అయితే టెండరు నిబంధనల్లో అధికారులు సూచించిన నిబంధనల ప్రకారం గత ప్రభుత్వంలోనే ఇసుక కాంట్రాక్టర్లు నిర్వహించిన వారికి మాత్రమే ఈ టెండర్లలో అవకాశం దక్కనుందని శాండ్ కమిటీ జారీ చేసిన నిబంధనలు చెబుతున్నాయి. సోమవారం సాయంత్రం 5 గంటలలోగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టెండర్ల దాఖలుకు గడువు ముగియనుంది.

పంట కాల్వలోకి కారు

డ్రైవర్ క్షేమం

వార్త..7లో



వెలిచేరు ఇసుక ర్యాంపులో బాటలు వేసి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు




వెలిచేరు అనధికార ఇసుక ర్యాంపు నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలింపు

తవ్వుకో..దోచుకో..

- వెలిచేరు ఇసుక ర్యాంపులో దొంగలు పడ్డారు!
- యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- ఫిర్యాదు చేసినా చోద్యం చూస్తున్న అధికారులు
- ట్రాక్టర్ ఇసుక రూ.1500కు విక్రయం

ఆత్రేయపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలనుకుంటున్న ఉచిత ఇసుక పథకం లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారిపోతోంది. ఇప్పటికే ఆత్రేయపురం మండలంలో అంకంపాలెం, నార్కెడిమిల్లి, పులిదిండి వద్దిపర్రు, ఆత్రేయపురం ఇసుక ర్యాంపులను ప్రారంభించడమే కాకుండా మరో మూడు ర్యాంపులను అధికారులు మంజూరు చేయనున్నారు. ఈ ర్యాంపుల ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహ నిర్మాణదారులకు ఉచితంగా ఇసుక అందించాల్సి ఉంది. ఈ ర్యాంపులలో సీరియల్ ప్రకారం కాంట్రాక్టర్లు వ్యవహరించకుండా సొంత వాహనాల ద్వారా ఇసుక తరలించుకుని అధిక రేటుకు అమ్ముతూ సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు సైతం ప్రజలు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. మరో పక్క ఇసుకాసురులు అనధికార ర్యాంపుల్లోకి చొరబడి ఇసుకను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. కొద్దిరోజుల క్రితం కట్టుంగ ఇసుక ర్యాంపులో అక్రమార్కులు వందలాది ట్రాక్టర్ల ఇసుకను అమ్మేసుకున్నారు. మరో పక్క వెలిచేరులో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. సుమారు 15 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను కొల్లగొట్టారు. గోదావరి నదీ గర్భంలోకి బాటలు వేసి ట్రాక్టర్ గ్రామంలో అన్‌లోడింగ్ చేస్తే రూ.1000, పక్క గ్రామానికి తీసుకెళితే రూ.1500 ధరను నిర్ణయించి అమ్మకాలు సాగించి లక్షలాది రూపాయలు కాజేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ ఇసుక నిల్వలు చేసుకుని లారీల ద్వారా అమ్మేందుకు గుట్టలు పెట్టారు. ఇంత దందా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



వెలిచేరులో ఇసుక అక్రమ నిల్వలు

సంకల్పంతో రండి.. సాయం చేస్తాం

- పరిశ్రమలు స్థాపించే వారికి మంత్రి సుభాష్ పిలుపు
- ప్రతి కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త ఉండాలనేది చంద్రబాబు కల
- ఆ దిశగా ప్రభుత్వం చర్యలు
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ అవగాహన సదస్సులో మంత్రి వాసంశెట్టి సుభాష్



సభలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఔత్సాహికులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించాలనే సంకల్పంతో వస్తే పరిశ్రమల స్థాపనకు, మార్కెటింగ్‌తో సహా అన్ని విధాలా సహకారం అందజేస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ పేరిట పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. ప్రభుత్వం గుర్తించిన 1054 పరిశ్రమల్లో ఔత్సాహికులు ఆసక్తి మేరకు ఎంచుకుని ముందుకు వస్తే దరఖాస్తు నుంచి బ్యాంకు రుణాలు వరకు పరిశ్రమల స్థాపన, మార్కెటింగ్ అన్ని దశల్లో పూర్తిగా సహకరించేందుకు సిబ్బందిని బృందాలుగా నియమించామన్నారు. పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిలో 35 శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. పెట్టుబడిదారులకు కోనసీమ ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపనకు అనువైన ప్రాంతమన్నారు. సోలార్ డ్రైయర్ ద్వారా అరటి, టమాట నుంచి పౌడర్ తయారు చేసి ఉత్పత్తి చేస్తే డిమాండ్ ఉందన్నారు. కోటిపల్లి ప్రాంతంలో 350 ఎకరాలు పట్టాభూములు గుర్తించామని పాడి పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే పశుగ్రాసం పెంచేందుకు భూములు సమకూర్చుతామన్నారు. ఆర్డీవో కూడా 6 ఎకరాలు భూమి గుర్తించారని పరిశ్రమల స్థాపనకు స్థలాలకు ఇబ్బంది లేదన్నారు. వితంతు మహిళలు సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వాటి పెట్టుబడి తాను పెడతానని తెలిపారు. రామచంద్రపురంలో కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఔత్సాహికులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని మహిళలకు డా.ఆశ్లేష ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు.

ప్రతీ నియోజకవర్గంలో అవగాహన సదస్సులు

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బదులుగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పరిశ్రమల స్థాపనకు సౌకర్యాలు వేగంగా ఇవ్వాలనేది ప్రభుత్వ నిర్ణయమని అన్నారు.. ఇటువంటి అవగాహన సదస్సులు ప్రతీ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ప్రోత్సాహకాలు ప్రకటించిందన్నారు. డా.ఆశ్లేష మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలో ష్యూరిటీ లేకుండా ఎంఎస్ఎంఈ క్రెడిట్ సిస్టం ద్వారా కోటి వరకు ప్రభుత్వం సమకూర్చుతుందన్నారు. అవగాహన సదస్సు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు, కడియపులంక క్వాయర్ క్లస్టర్ చైర్మన్ నందూరి ఫణికుమార్ మాట్లాడారు. వివిధ స్టాల్స్‌ను కలెక్టర్ మహేష్‌కుమార్ సందర్శించారు. కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, తహసీల్దార్ సావిత్రి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అమలు చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్

ద్రాక్షారామ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి):గురుకుల పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అమలు చేసి ఆరోగ్యకరమైన భోజనం అందించాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. రామచంద్రపురం మండలం వెలంపాలెంలో జ్యోతీరావు పూలే బీసీ సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆదివారం తనిఖీ చేశారు. బాలికల వసతి గృహ స్థితిగతులు, సౌకర్యాలు, మెనూ అమలు, తరగతులు నిర్వహణపై అధికారులను ప్రశ్నించారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంటగది, డైనింగ్ హాలు, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. బాలికలతో మాట్లాడారు. వర్షం వస్తే శ్లాబు లీకవుతుందని బాలికలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అధికారులు ప్రైవేటు భవనంలోకి మార్పు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా బాలికలు ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించేలా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో అఖిల, తహసీల్దార్ సావిత్రి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలస్థాయిల్లో గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు

క్రీడలతో అంతర్జాతీయ ఖ్యాతి

7లో

- క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- రావులపాలెంలో అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

- శాప్ చైర్మన్ రవినాయుడు
- 'నన్నయ'లో క్రీడా నిర్మాణాల పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాకాన్ని, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పాలనే ఉద్దేశంతో లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర క్రీడాసాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులను ఆయన, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి ఆదేశాల మేరకు పాఠశాలల్లో క్రీడామైదానం ఖచ్చితంగా ఉండాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జరగాల్సిన పనులు అనుకున్న సమయానికి జరగలేదని, కాంట్రాక్టర్ ఉదాసీనంగా వ్యవహరిస్తూ పనులు జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి క్రీడాకారుల భవిష్యత్ ఎంతో ముఖ్యమైనదని దానికి తగినట్టుగా జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నామని చెప్పారు. గతంలో విశ్వవిద్యాలయంపై ఎన్నో అభియోగాలు వచ్చినప్పటికీ ప్రస్తుత వీసీ శ్రీనివాసరావు నాయకత్వంలో వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పనుల నిర్మాణాలను పరిశీలించామని ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు ఇండోర్‌స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులు పూర్తి కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడలు నిర్వహించే స్థాయికి ఇక్కడ వసతులు సమకూర్చాలని ఆదేశించారు. తాము ఆదేశించిన సమయానికి పనులు పూర్తికాకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని రవినాయుడు తెలిపారు. గతంలో 2016లో చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రాలను కనుమరుగు చేశారని ఆరోపించారు. వాటిపై దృష్టి సారిస్తామన్నారు. జాతీయ క్రీడలకు రాష్ట్రంలోని క్రీడాకారులంతా సంసిద్ధంగా ఉండాలని కోరారు. అందుకు శాప్ పూర్తి సహాయసహకారాలు అందిస్తామని శాప్ చైర్మన్ చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చాయని వాటిని పరిశీలించి ఆమోదించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పాఠశాలల నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు కార్యాచరణలు రూపొందిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో క్రీడావసరులు ఇంకా పటిష్టంగా ఉండాలన్నారు. దీనికి భిన్నంగా గత ప్రభుత్వ వైఖరి కారణంగా విశ్వవిద్యాలయాల్లో క్రీడావసతులు లేకుండా పోయాయన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఖేలె నిధులతో నిర్మిస్తున్న పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో సీఎం, హెచ్‌ఆర్‌డీ మంత్రుల దృష్టిలో ఉన్న అంశాన్ని పరిశీలించేందుకు శాప్ చైర్మన్ వచ్చి ఇక్కడ పనులు పరిశీలించారన్నారు. విజయవాడలో 50 మీటర్ల స్విమ్మింగ్ పూల్ నన్నయ విశ్వవిద్యాలయంలో రావడం ఆనందకరమని చెప్పారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు ప్రతిరోజూ మోనటరింగ్ చేయాలని సూచించారు. శాప్ చైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తిచేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల విశ్వవిద్యాలయంలో రాజకీయపరమైన ఒత్తిళ్లు లేకుండా చక్కని పరిపాలన అందించేందుకు అవకాశం దక్కిందన్నారు. శాప్ చైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణాలు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, విశ్వవిద్యాలయం ఇంజనీర్ కె.నూకరత్నం, విద్యాకళాశాల చైర్మన్ కె.సుబ్బారావు, శాప్ అధికార్లు, ఇంజనీర్లు, నాయకులు, పీడీలు పాల్గొన్నారు.

మురిపించిన మంచు సోయగం



మోతుగూడెం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ తులసిపాక వ్యూ పాయింట్ వద్ద మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి వాతావరణాన్ని ఆస్వాదించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.కనిష్ట ఉష్ణోగ్రతల నమోదువుతూ ఉండటంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు



ధర్మవరంలో ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రత్తిపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఆదివారం ఎలక్ట్రికల్ బైక్ దగ్ధమైంది. గ్రామంలోని బ్యాంక్ సమీపంలో గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి దేవరపల్లి సత్యనారాయణ బైక్‌కు ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో బ్యాంకు సమీపంలో దానిని నిలిపి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పొగలు కమ్మిన బైక్‌ను ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు. రూ.1.20లక్షలతో కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం కావడంపట్ల బైక్ యజమాని కంపెనీకి సమాచారం అందించారు.

అక్రమంగా తరలిస్తున్న 32 పశువులు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున వ్యాన్‌లో పశువులు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న వ్యాన్‌లో ఉన్న 32 పశువులను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

క్రీడలతో అంతర్జాతీయ ఖ్యాతి

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- క్రీడలపట్ల సీఆర్సీ చూపుతున్న ఆశక్తి అభినందనీయం
- 13 జిల్లాల నుంచి 26 జట్ల క్రీడాకారుల రాక

రావులపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు వారు రాణించే క్రీడల్లో చూపించే ప్రతిభాపాటవాలతో అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందని రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆంధ్రా కబడ్డీ అసోషియేషన్ రావులపాలెం సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఆవరణలో 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావులు పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, కార్యదర్శి కర్రి అశోకొరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. క్రీడాకారుల ఉద్యోగాల అవకాశాలలో 2 శాతం ఉన్న రిజర్వేషన్లు 3 శాతం పెంచి క్రీడాకారుల పట్ల మక్కువను చాటుకున్నారన్నారు. భవిష్యత్ రాష్ట్రంలో ఉన్న క్రీడాకారులను నేషనల్, ఇంటర్నేషనల్‌స్థాయికి ప్రోత్సహించేందుకు అన్నివిధాలా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ప్రభుత్వమే కాకుండా రావులపాలెం సీఆర్సీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సొంత ఖర్చులతో క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ క్రీడాకారుల వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. గ్రామీణస్థాయి క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు వచ్చే విధంగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఆర్సీ చేస్తున్న కృషి, సేవ అభినందనీయమన్నారు. అనంతరం మంత్రి ప్రజాప్రతినిధులతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుండి 26 జట్ల క్రీడాకారులను కబడ్డీ పోటీల్లో తలబడేందుకు సిద్ధమయ్యారు. 13 బాలుర విభాగం కాగా, 13 బాలికల విభాగం. అనంతరం పలు జట్లు మ్యాచ్‌ను ప్రారంభించి పోటీల్లో తలబడ్డారు. ఇక్కడ జరిగే బాలుర, బాలికల విభాగంలో లీగ్ అండ్ నాకౌట్ పద్ధతిలో జట్లు తలపడతాయన్నారు. ఈరోజు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఈస్ట్‌గోదావరి-విశాఖపట్నం తలపడగా ఆరు పాయింట్లతో ఈస్ట్‌గోదావరి గెలిచింది. ప్రకాశం-విజయనగరం తలపడగా 22పాయింట్లతో విజయనగరం గెలిచింది. శ్రీకాకుళం-కర్నూలు తలపడగా 19 పాయింట్లతో శ్రీకాకుళం విజయం సాధించింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి, చిన్నం తేజారెడ్డి, నందం వీరవెంకట సత్యనారాయణ, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, సత్తి రామకృష్ణారెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెం సీఆర్సీలో జ్యోతిప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సముద్ర జలాల్లో

మత్స్య జాతుల వృద్ధికి కార్యాచరణ

- మత్స్యశాఖ కమిషనర్ దోలాశంకర్ వెల్లడి

కాకినాడ సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాల్లో మత్స్యజాతుల వృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ వెల్లడించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా ఆదివారం కాకినాడ సమీపంలోని హోప్ ఐలాండ్, పరిసర ప్రాంతాలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మత్స్యశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హోప్ ఐలాండ్ పరిసర ప్రాంత సముద్ర జలాల్లో సముద్రపు నాచు మొక్కల పెంపకం, తీరం వెంబడి సముద్ర కేజ్‌కల్చర్ యూనిట్స్‌లో అనుగుణమైన మత్స్యజాతుల పెంపకానికి అనుకూలమైన స్థలాలను పరిశీలించారు. అనంతరం మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్ మీడియాతో మాట్లాడుతూ సముద్ర జలాల్లో రాఫ్ట్ కల్చర్ పద్ధతి లో సముద్రపు నాచు మొక్కలు పెంచు తామన్నారు. తీరం వెంబడి స్థలాల్లో సముద్ర కేజ్ కల్చర్ యూనిట్స్‌లో మత్స్యజాతుల పెంపకం చేపడతామన్నారు. త్వరలో దీనిపై సమగ్ర నివేదికను ప్రతిపాదనల రూపంలో తయరు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, కాకినాడ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాడి నాగేశ్వరరావు, ఫిషరీస్ మెరైన్ జేడీ పి.సురేష్, ఆక్వా జేడీ ఎండీ లాల్ మహమ్మద్, ఎస్‌ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ టి.సుమలత, జిల్లా మత్స్యశాఖ అధికారి కె.కరుణాకర్, ఫిషరీస్ ఏడీ, ఎస్‌ఐఎఫ్‌టీ ఎడీవో హోప్ ఐలాండ్‌ను సందర్శించారు.


హోప్ ఐలాండ్, పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ దోలాశంకర్, ఎమ్మెల్యే కొండబాబు


పాపికొండలుకు వెళుతున్న పర్యాటక బోట్లు

పాపికొండలుకు తొమ్మిది బోట్లు

- విహారయాత్రకు పర్యాటకుల సందడి

దేవీపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు పోటెత్తారు. తొలుతగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది బోట్లలో సుమారు 600మంది పర్యాటకులు మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరీవాహక ముంపు ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు నుంచి పేరంటాలపల్లి వెళ్లి సందడి చేశారు. అనంతరం తిరిగి సాయంత్రం 5గంటలకు పోశమ్మగండి చేరుకున్నారు.

పేరంటాలపల్లి వెళ్లిన 16 బోట్లు

వరరామచంద్రాపురం: పాపికొండలు, పేరంటాలపల్లి విహార యాత్ర ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆదివారం 16 బోట్లు వెళ్లాయి. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో పర్యాటకులు దాదాపుగా 1200 వందల మందికి పైగానే విహారయాత్రకు పర్యాటకులు రావడంతో పోచవరం పెర్రి పాయింట్ దగ్గర, పేరంటాలపల్లి మునిమఠం (శివాలయం) ప్రదేశాలలో పర్యాటకులతో సందడి వాతావరణం ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతాలలోని కొండరెడ్లు వెదురుతో తయారుచేసిన అల్లికలను పర్యాటకులను ఆకర్షించడంతో వారి వద్ద నుంచి కొనడంతో ఆప్రాంత కొండరెడ్లకు కొంతవరకు ఉపాధి చేకూరుతుంది.

డాక్టర్ శ్రీనివాస్ సంపాదకీయాలు, రచనలు..

సమాజాన్ని చైతన్యం చేశాయి

- సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్‌తో గెట్‌టుగెదర్‌లో వక్తలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్.. (ఇన్‌సెట్‌లో) శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్ సంపాదకీయాలు, రచనలు సమాజాన్ని చైతన్యం చేశాయని పలువురు వక్తలు అన్నారు. తూర్పుగోదావరిజిల్లాలోని రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాలులో ఆదివారం డాక్టర్ శ్రీనివాస్‌తో ఏపీయూడబ్ల్యూజే, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమయం.. సందర్భం' పేరిట గెట్ టు గెదర్ కార్యక్రమం సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి అహూతులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, ప్రముఖ మానసిక వైద్యులు కర్రి రామారెడ్డి, గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణ, రచయితలు అద్దేపల్లి ప్రభు, మారిశెట్టి జితేంద్ర, ముక్కామల చక్రధర్, టీడీపీ నేత యర్రా వేణుగోపాలరాయుడు, దేశిరెడ్డి బలరామనాయుడు, చాంబర్ పూర్వపు అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ, అయ్యలగోపి, సన్నిధానంశాస్త్రి, రాకా కార్యదర్శి జీవీ రమణ, ఆంధ్రజ్యోతి బీఎం ఎస్.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మీడియా విస్తృతి, విలేకరులు, సోషల్‌మీడియా పెరగడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యానికి మంచిదేనన్నారు. జర్నలిజంలోకి కొత్తగా వస్తున్నవారిలో చాలా ధైర్యంగా రాసేవాళ్లు ఉన్నారన్నారు. రాజమహేంద్రవరంతోను, గోదావరితోను, వీరేశలింగం పంతుల తోటతోను తనకున్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. తొలుత రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి పత్రిక నిబద్ధతతో తన పంథాను కొనసాగిస్తోందని, సాహిత్యానికి కూడా పెద్దపీట వేస్తోందన్నారు. సంపాదకులుగా పనిచేసిన డాక్టర్ శ్రీనివాస్ తన ప్రస్థానం కొనసాగించాలన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఐడియాలజీ, ఫిలాసఫీతో నడిపే పత్రికల్లో ఆంధ్రజ్యోతి ఒకటని, అటువంటి పత్రికలో సిద్ధాంత బద్ధంగా పనిచేస్తూ ప్రభుత్వాలను నిలదీసే సంపాదకీయాలు రాసిన డాక్టర్ శ్రీనివాస్ విలువలకు పెద్దపీట వేశారని కొనియాడారు. ఉభయ గోదావరి జిల్లాల పాత్రికేయులు కలిసి ఆంధ్రజ్యోతి పక్షాన డాక్టర్ శ్రీనివాస్‌ను గజమాలతో, శాలువాలతో సత్కరించారు. ఏపీయూడబ్ల్యూజే, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ పక్షాన జ్ఞాపికలను శ్రీరామ్మూర్తి, కుడుపూడి పార్థసారథి అందించారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

అన్నవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం సెలవుదినం కావడంతో అశేష భక్తజనంతో పోటెత్తింది. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచియుండాల్సి వచ్చింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఏఈవో కొండలరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా సుమారు 40 లక్షల ఆదాయం లభించింది.

ఘనంగా సత్యదేవుడి రథసేవ :

సత్యదేవుడికి వారాంతపు అర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుండి తోడ్కొనివచ్చి టేకురథంపై ఆసీనులు గావించి అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

'లోవ' ఆదాయం రూ.2.48 లక్షలు

తునిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. తలుపులమ్మ అమ్మవారిని అర్చకస్వాములు సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని వసతిగదులు, ఆరు బయట వంట షెడ్లలో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా రూ.2.48 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

మళ్లీ కాలువలోకి కారు

- ప్రాణాలతో బయటపడిన వాహనదారుడు
- ప్రమాదాన్ని చూస్తూ..రెండు ద్విచక్రవాహనాలు ఢీ
- పది రోజుల వ్యవధిలో ఇది రెండో ప్రమాదం
- భయాందోళనలకు గురవుతున్న స్థానికులు


కాలువలోకి దూసుకుపోయిన కారును తీస్తున్న దృశ్యం

పి.గన్నవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటవద్ద పదిరోజులక్రితం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ, ఇద్దరు చిన్నారులు చనిపోయారు. ఈసంఘటన మరువక ముందే మళ్లీ కారు పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే స్థానికులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రావులపాలెం వైపు నుంచి వస్తున్న కారు ప్రమాదవశాత్తూ అదుపుతప్పి ప్రధాన పంట కాల్వలోకి దూసుకుపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అల్లవరం మండలం దేవగుప్తంనకు చెందిన పోసిన పెద్ది సాయిధీరజ్ రావులపాలెం నుంచి తమ బంధువులు ఇంటికి రాజోలు మండలం కడలి గ్రామానికి కారులో బయలుదేరాడు. ఈక్రమంలో రాజవరం-పొదలాడ రోడ్డులో ఉడిమూడి శివారు చింతావారిపేట వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తూ కారు ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో చాకచక్యంగా వ్యహరించి వెనుక భాగంలో ఉన్న డిక్కీని ఓపెన్ చేసి బయటపడటంతో స్థానికులు ఒడ్డుకు చేర్చారు. అదే సమయంలో ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తూ....అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టాడు. ఈఘటనలో వెనుకవస్తున్న వాహనదారుడు (పశ్చిమగోదావరిజిల్లా కైకరంనకు చెందిన)కి బలమైన గాయంకావడంతో 108సాయంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వల్పగాయాలతో బయటపడిన సాయిధీరజ్ స్థానికులు సాయంతో కారును బయటకు తీశారు.

పదిరోజుల వ్యవధిలో.. రెండో ప్రమాదం

ఒక ప్రమాదం జరిగి పదిరోజులు పూర్తి కాకుండానే కూతవేటు దూరంలో అదేమాదిరిగా మరో ప్రమాదం జరగటంతో స్థానిక ప్రజానీకంతో పాటు వాహనదారులు సైతం తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ఈనెల 10వతేదీ తెల్లవారుజామున జరిగిన ఘోర కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. ఆ సంఘటనను మరువక ముందే మరో ఘటన అదే ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రాజవరం-పొదలాడ రోడ్డులో పొదలాడ నుంచి గంటి వరకు కాలువ వైపు రక్షణగా ఇనుప రైలింగ్‌ను ఏర్పాటుచేసి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అమలాపురం

డిగ్రీ కళాశాలలో రామానుజన్ జయంతి

రావులపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర అధ్యాపకులు బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామానుజన్ గురించి విద్యార్థులకు వివరించారు.

ఎమ్మెల్యే దేవ పరామర్శ

మలికిపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సతీ వియోగంతో బాధపడుతున్న మోరి మాజీ సర్పంచ్ జాన శంకరరావును రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావు తదితరులు పరామర్శించారు. శంకరరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

● అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై పలు చోట్ల నిరసనలు



అమలాపురంలో అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. తొలుత అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పీవీ రావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మాల మహానాడు నాయకులు పెయ్యల శ్రీనివాసరావు, పెయ్యల పరశురాముడు, జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, గన్నవరపు శ్రీను తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్ర పాలకుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అంబేడ్కర్‌పై ప్రధాని మోదీకి నిజంగా ప్రేమ ఉంటే తక్షణం అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన ర్యాలీలో నాయకులు మట్టా వెంకటరావు, పెనుమాల చిట్టిబాబు, పోతుల నాగరాజు, కాశి వెంకట్రావు, పరమట రామ్‌ప్రసాద్, గోసంగి సంపదరావు, నందిక శ్రీను, నెల్లి ప్రసాద్, గెద్దాడ బుద్ధరాజ్, సరెళ్ల రామకృష్ణ, బొంతు శ్రీను, మెండి డేవిడ్‌అంబేడ్కర్, కాశి రాంబోధి, పోతుమూడి రవి, రొక్కాల నాగేశ్వరరావు, పరమట నానితో పాటు పీవీ రావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కాట్రేనికోన, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాలమహానాడు జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివారం గేట్ సెంటర్‌లో అమిత్ షా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. సీనియర్ దళిత నాయకుడు నల్లా నరసింహమూర్తి, జగడం బాలయోగి, వడ్డి శ్యామ్ ప్రసాద్, అయితాబత్తుల శ్రీనుబాబు, అయితాబత్తుల పండుబాబు, కాశి భరత్, వజ్రపు శరత్, నందిక శ్రీను, బూల పృధ్వి, బూసి రాంబాబు, గుత్తాల వరప్రసాద్, కాశి రోడ్స్, వెంకమ్మచెరువు యూత్, ఆటో గజినీ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన

పి.గన్నవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని మండల దళిత నాయకులు నిరసన చేశారు.ఆదివారం పి.గన్నవరం త్రీరోడ్డు సెంటర్‌లో అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పుచ్చకాయల సత్యనారాయణ, యన్నపు పెద్ద, కొక్కిరి రవికుమార్, కొంబత్తుల ఏసు, కోట విజయభాస్కర్, కొల్లే సూర్యనారా యణ, పుచ్చ కాయల నరసింహ మూర్తి, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై ఆందోళన

యానాం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ మాట్లాడిన తీరును ఖండిస్తూ యానాం నియోజకవర్గం పరిధిలో దళిత, వివిధ సంఘాల నాయకులు ఆందోళన, శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. హోం మంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామ చేయాలని నాయకులు నినాదాలు చేశారు. అనంతరం యానాంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పరిపాలనాధికారి మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గిడ్ల చంద్రరావు, పెండెం సూర్యప్రకాష్, గూటం శివగణేష్, బడుగు బలరాం, బోళ్ల జోజీ, లంక బంగారం, మడికి వెంకటేశ్వరరావు, పొలిమారి సత్యనారయణ, రక్షా ఆంజనేయులు, శేరు కృష్ణా, సహదేవరాజు, మోకా బాబూరావు, మట్టపర్తి గణేష్ పాల్గొన్నారు.

మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు వర్ధంతి

● మాలమహానాడు జేఏసీ, మాల ఉద్యోగ సంఘాల జేఏసీ, దళిత చైతన్య వేదిక నాయకుల నివాళి





ముమ్మిడివరం: పీవీరావుకు నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

ఉప్పలగుప్తం: చల్లపల్లిలో పీవీ రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

ముమ్మిడివరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీరావు వర్ధంతిని ముమ్మిడివరంలో మాల మహానాడు జేఏసీ, మాల ఉద్యోగసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలమ్మ చెరువుగట్టున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పీవీరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా చీకురుమెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు ఎం.ఆశీర్వాదం, నాయకులు కాశి జగపతిరావు, కాశి జగ్జీవన్‌రామ్, మట్టా శ్రీను, కాశి వెంకటాచారి, దాసరి వెంకటరమణ, ఎన్.అబ్బులు, యలమంచిలి బాలరాజు, కాశి సిద్ధార్థవర్మ, వడ్డి నాగేశ్వరరావు, జనార్ధన్‌లతో పాటు పలువురు పీవీరావు అందించిన సేవలను కొనియడారు. అలాగే ముమ్మిడివరం నగర పంచాయతీ పోలమ్మచెరువుగట్టున ఉన్న జై బుద్ధ పార్కు వద్ద పీవీరావు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధ వందనంచేసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ రావు చిత్రపటానికి మాలమహానాడు నాయకులు నివాళులర్పించారు. వడ్డి నాగేశ్వరరావు, కాశి బాబూజీగ్జీవన్‌రామ్, ఎం.ఆశీర్వాదం, ఎన్.అబ్బులు, కాశి సింహాద్రి, సబ్బతి సత్యనారాయణ, యలమంచిలి బాలరాజు, జనిపెల్ల జనార్ధనరావు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు వర్ధంతిని కాట్రేనికోనలో ఆదివారం నిర్వహించారు. సీనియర్ దళిత నాయకుడు నల్లా నరసింహమూర్తి, జేఏసీ నాయకులు జగడం బాలయోగి, వడ్డి శ్యామ్‌ప్రసాద్, అయితాబత్తుల శ్రీనుబాబు, అయితాబత్తుల పండుబాబు, నందిక శ్రీను, వజ్రపు శరత్, కాశి భరత్, బూల పృధ్వి, పొద్దోకు బాలు, జొన్నాడ రాజారావు, గెద్దాడ శ్రీను, గుత్తాల వరప్రసాద్, బూసి రాంబాబు, మట్టా రాహుల్ పాల్గొన్నారు.

మామిడికుదురు,(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని మామిడికుదురులో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి మాలల అభ్యున్నతికి ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. మాలమహానాడు నాయకులు అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం అక్విడెక్టు వద్ద పీవీ రావు విగ్రహానికి పలువురు దళిత నేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు. యన్నపు పెద్ద, పుచ్చకాయల సత్యనారాయణ, కొంబత్తుల ఏసు, కొక్కిరి రవికుమార్, కొంబత్తుల ఏసు, కోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలో ఆదివారం అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పీవీ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కోనసీమ దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పరమట వెంకటేశ్వరరావు, కాట్రు ఆనందరావు, బూసి బుజ్జిదొర, కొల్లు నాగేశ్వరరావు, కొల్లు ప్రసాద్, పెయ్యల అర్జునరావు, కాట్రు మధు పాల్గొన్నారు. ఎన్.కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిట్టికుమారిచిన్ని, కొంకి వెంకటబాబ్జి, యలమంచిలి విజయకుమార్, కొంకి రాజారావు, కొంకి భగవాన్‌దాస్, గోసంగి శ్రీనివాసరావు, కొంకి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తుదివరకు పోరాడిన మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావుకు పలువురు నివాళులర్పించారు. బోడసకుర్రు, దేవర్లంక, కంసాలమామిడి తదితర ప్రాంతాల్లో పీవీ రావు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి వర్ధంతి జరిపారు. రొక్కాల నాగేశ్వరరావు, సాపే ధర్మరాజు, బొంతు శ్రీను, అంబటి శ్రీను, మోసుగంటి దుర్గారావు, జల్లి రాధాకృష్ణ, పి.స్వామి, ఎన్.గణేష్, కె.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం,(ఆంధ్రజ్యోతి): మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు వ్యవస్థాపకులు పీవీరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతా రాజబాబు, నల్లి శివ, గెడ్డం ఫిలిప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): తాటిపాకలో మాలమహానాడు వ్యవస్థాపకుడు స్వర్గీయ పీవీ రావు వర్ధంతిని దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో బి.సావరంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బి.సావరంలో పీవీ రావు చిత్రపటానికి రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం పూలమాలలువేసి నివాళులర్పించారు. తాటిపాక సెంటర్‌లో పీవీ రావు విగ్రహానికి దళిత చైతన్య వేదిక నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, మండల జేఏసీ ఉపాధ్యక్షుడు మందపాటి మధు, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, మట్టా సురేష్‌కుమార్, జిల్లెల్ల వినోద్ పాల్గొన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): పీవీరావు వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబే డ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళుర్పించారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు నాగవరపు నాగరాజు, సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, నెల్లి వెంకటరమణ, నాగాబత్తుల నరసింహమూర్తి, కోట హనుమంతరావు, నాగాబత్తుల సుధాకర్, గోసంగి కుమారస్వామి, కత్తుల బాబులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి



యూటీఎఫ్ జిల్లాశాఖ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తక్షణ కర్తవ్యంగా గుర్తించాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు సాగించాలన్నారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులపై ఉన్న అదనపు పని భారాన్ని ప్రభుత్వం తగ్గించాలన్నారు. పాఠ్యాంశాలు బోధించేందుకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ప్రతీ ఆదివారం తరగతులు నిర్వహించాలని ఇచ్చిన సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణం విడుదల చేయాలన్నారు. నూతన పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించి ఐఆర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఎన్నికల అధికారిగా జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టీచర్స్ ఒలింపిక్స్-2024 పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీలు ఐవీ, బొర్రా చేతులమీదుగా షీల్డులు అందజేశారు.

యూటీఎఫ్ జిల్లాశాఖ నూతన కార్యవర్గం: జిల్లాశాఖ గౌరవాధ్యక్షునిగా పి.వెంకటేశ్వరరావు, అధ్యక్షునిగా పి.సురేంద్రకుమార్, సహ అధ్యక్షునిగా జీవీ రమణ, మహిళా సహ అధ్యక్షులుగా జి.సీతాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంటీవీ ఏఎస్ సుబ్బారావు, కోశాధికారిగా సీహెచ్ కేశవరావు, కార్యదర్శులుగా వై.మురళీమోహన్, జె.దుర్గాప్రసాద్, ఎం.ప్రదీప్‌కుమార్, పి.శ్రీనివాస్, పి.మురుగేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, వైవీఎస్ఎన్ బాలాజీ, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాసరావు, వి.రత్నం, జి.రాజు, బి.చంద్రకళ, శకుంతల, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నియోజకవర్గ జనసేనపార్టీ సమావేశం



ముమ్మిడివరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి నామినేటెడ్, స్థానిక సంస్థల్లో 30శాతం పదవులు కేటాయించే విధంగా పార్టీ అధిష్టానం, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దృష్టికి తీసుకువెళ్లాలని జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ సమావేశం తీర్మానించింది. ముమ్మిడివరం మండలం కొమానపల్లి గెస్ట్‌హౌస్‌లో ఆదివారం జనసేన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు మద్దతు తెలిపి ఆయన విజయానికి కృషి చేశారన్నారు. జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలను గుర్తించే విధంగా ముమ్మిడివరం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి జనసేన పార్టీకి కేటాయించాలని, స్థానిక పదవుల్లో జనసేనకు 30శాతం పదవులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో నీటి సంఘం సభ్యులుగా ఎన్నికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్, కుడుపూడి శివన్నారాయణ, మండల అధ్యక్షుడు దూడల స్వామి, మద్దింశెట్టి పురుషోత్తం, అత్తిలి బూరావు, కర్రా దుర్గాప్రసాద్, మోకా బాలప్రసాద్‌లతో పాటు పుణ్యమంతుల సూరిబాబు, లంకలపల్లి జమ్మి, ఓగూరి భాగ్యశ్రీ, బద్రి రమ, మాదాల శ్రీధర్, నూకల దుర్గ, గాలిదేవర బుల్లి, విళ్ల వీరా, కొప్పిశెట్టి గణేష్, సవరపు వెంకట్, యలమంచిలి బాలరాజు, చవటపల్లి మణికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ

మామిడికుదురు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామికి లక్ష తులసి పూజా కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పూజా కార్యక్రమంలో స్వామి సన్నిధిలో ఉన్న ఆంజనేయునికి పంచామృతాలతో అభిషేకాలు, గంధసింధూరం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష తులసి పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఖండవల్లి మురళీకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా జరిపారు. పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గాలిగోపురం, మండపం పనులకు భూమి పూజ



గాలిగోపురం, మండపం పనులకు పూజలు చేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి తదితరులు

యానాం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా గాలిగోపురం, మండప నిర్మాణ పనులకు పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ పునఃనిర్మాణ కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు, ఉదయం 8.15గంటలకు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఖండవల్లి రామకృష్ణ, కమిటీ ప్రతినిధులు కాపగంటి ఉమాశంకర్, మంచాల సత్యసాయికుమార్, టీఎస్ రాజేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా బాలఆలయంలో ఉన్న స్వామివార్ని దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం మల్లాడి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం, భక్తుల సహకారంతో ఆలయం నిర్మాణం జరుగుతుందన్నారు. మొదటి విడతలో రూ.6కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రెండో విడతలో పనులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామ న్నారు. ఆలయానికి సంబంధించిన త్రిడీ వీడియోను తయారు చేయించడం జరుగుతుందన్నారు.

పీవీ రావుకు నివాళి

ఐ.పోలవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాత ఇంజరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతి నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పించారు. రేవు శ్రీను, వడ్డి గౌతమ్, మట్ట గగనవీరుడు, దుక్కిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

అయినవిల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక దేవస్థానంలో ప్రతీ సంవత్సరం వార్షికంగా సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్న సంక్రాంతి ఏర్పాట్లపై ఆదివారం ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. హిందూ మత సంప్రదాయం ప్రతిబింబించే విధంగా వినూత్నంగా వివిధ రాష్ట్రాల నుంచి వాయిద్య బృందాలను తీసుకువచ్చి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు ఆలయ ప్రాంగణమంతా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు, పుష్పాలంకరణలు చేయుటకు, ఆలయంలో తగిన వసతి ఏర్పాట్లు చేసేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారికి గ్రామస్తులు పలు సూచనలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, సర్పంచ్ కాకర శ్రీనివాస్, ఉప సర్పంచ్ పోలిశెట్టి రాజేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రకటించారు. జిల్లా శాఖ అధ్యక్షుడిగా మట్టపర్తి బాలశంకరం, ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్ సూర్యనారాయణను నియమించారు. బాలశంకరం దేవగుప్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగాను, సూర్యనారాయణ వీరవల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ బడుల పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో అసోసియేషన్ ముందు వరుసలో ఉంటుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు.

జనవరి 30 నుంచి మాసదీక్షా సూర్యారాధన ప్రారంభం

అమలాపురం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లిలో దశమ వార్షిక మాసదీక్ష సూర్యారాధన జనవరి 30నుంచి ప్రారంభం కానున్నట్టు నిర్వాహకులు గొర్తి గోపాలకృష్ణ తెలిపారు. 30వ తేదీ నుంచి ప్రారంభమైన మార్చి 2వ తేదీ పూర్ణాహుతి కార్యక్రమంతో మాసదీక్షా సూర్యారాధన పూర్తవుతుందన్నారు. దశమ వార్షిక పూజా కార్యక్రమాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతీరోజు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. మాస దీక్ష సూర్యారాధన పూర్వక హోమం శతచండీయాగశాలకు ఆదివారం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రాట ముహూర్తం నిర్వహించారు. గొర్తి వేంకటేశ్వరశర్మ, శిష్టా సత్యనారాయణమూర్తి, తాతా కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే మద్యం పాలసీ అమలు

అమలాపురం టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ నిర్ణయం మేరకే మద్యం పాలసీని అమలు చేస్తున్నామని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. నియోజకవర్గంలో ఎక్కడా మద్యం బెల్టు షాపులు లేకుండా ఎప్పటికప్పుడు ఎక్సైజ్ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అమలాపురంలో ఆదివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించిందని, కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యాన్ని ధరలు తగ్గించి విక్రయిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, దున్నాల దుర్గ, పలచోళ్ల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంతో సైకిల్‌పై శబరిమల యాత్ర



పి.గన్నవరం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): దుష్టపరిపాలన పోవాలి... కూటమి ప్రభుత్వం రావాలని శబరిమల అయ్యప్ప స్వామిని మొక్కుకున్న కూటమి నాయకులు, అభిమానులు మొక్కును తీర్చుకునేందుకు చాకలి పాలెం నుంచి సైకిళ్లపై బయలుదేరారు. ఎన్నికల సమయంలో వాడ్రేవుపల్లికి చెందిన పట్నాల దత్తాత్రేయ, మరో తొమ్మిది మంది సైకిళ్లపై శబరిమలై యాత్ర చేస్తామని మొక్కుకున్నారు. ఆదివారం సైకిల్ యాత్రను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియో జకవర్గ ద్విసభ్య కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, కూటమి నేతలు ప్రారంభించారు. తొలుత స్థానిక వినాయకుని ఆలయంలో ఇరిముడులు కట్టుకుని ప్రత్యేక పూజలు అనంతరం యాత్రను ప్రారంభించారు. వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, సంసాని పెద్దిరాజు, పత్తిపాటి వెంకన్న బాబు, శేరు త్రిమూర్తులు, యల్లమిల్లి చిట్టిబాబు ఉన్నారు.

శిరోముండనం బాధిత కుటుంబాలకు కుల ధ్రువీకరణపత్రాల మంజూరులో అధికారుల అలసత్వం

అమలాపురం టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకటాయపాలెం శిరోముండనం బాధితులు నేటికీ వివక్షకు గురవుతున్నారని మానవహక్కుల వేదిక జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్‌ఇక్బాల్, నామాడి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిరో ముండనం బాధిత కుటుంబాలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో నేటికీ అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు తక్షణం కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈకేసుకు సంబంధించి నేరం రుజువై నిందితులకు 18నెలలు జైలుశిక్ష కోర్టు విధించిందన్నారు. కేసులో బాధితులను ఎస్సీలుగా కోర్టు గుర్తించి తీర్పు ఇచ్చినప్పటికీ వారి పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకుండా రెవెన్యూ అధికారులు వేధిస్తున్నారన్నారు. బాధిత కుటుంబాల పిల్లలు విద్యా ఉపాధి అవకాశాలు నష్టపోతున్నారన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

5న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

అమలాపురం టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం హిందూ సమ్మేళనం సభను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ వైస్‌చైర్మన్ రుద్రరాజు నానిరాజు స్వగృహం వద్ద సమావేశం నిర్వహించారు. గొవ్వాల రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హైందవ శంఖారావాన్ని విజయవంతంచేసే కార్యక్రమంలో భాగంగా హిందువుల ప్రతీ ఇంటికీ స్టిక్కర్లు అతికించి ఆహ్వానపత్రాలు అందించేందుకు నిర్ణయించారు. కౌన్సిలర్లు దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, రామకృష్ణ, పిండి రాజా పాల్గొన్నారు. బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు, నగర ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య ఆధ్వర్యంలో మార్కెట్ వీధిలో హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గుత్తుల సుగుణ, పిచ్చిక సుబ్బారావు, సుగ్గు సుధీర్, గంగుమళ్ల దొరబాబు, చింతా హేమంత్, అల్లక వాసు, ఊటుకూరి మురళీ, ఊటుకూరి గీత పాల్గొన్నారు.

సీఐ ప్రశాంత్‌కుమార్‌కు కూటమి నేతల సత్కారం

అల్లవరం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన డి.ప్రశాంత్‌కుమార్‌ను అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జనసేన,టీడీపీ, బీజేపీ నాయకులు సత్కరించారు. గతంలో అల్లవరం ఎస్ఐగా పనిచేసిన ప్రశాంత్‌కుమార్ పోలీస్‌స్టేషన్ నిర్మాణంలో, శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతగా పనిచేశారని కూటమి నాయకులు ప్రశంసించారు. జనసేన మండల నాయకుడు కంకిపాటి వీరబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర సాయి, చిట్నీడి శ్రీను, బండిగుప్తాపు చిట్టివెంకన్న, కంకిపాటి పెదబుజ్జి, బి.కృష్ణ, బి.మల్లేష్, కంకిపాటి అరుణ్, ఎం.దొరబాబు పాల్గొన్నారు.

ప్రశాంత్‌కుమార్‌కు దళిత ఐక్యవేదిక నాయకుల సత్కారం

అమలాపురంరూరల్, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): అమలాపురం తాలూకా సీఐగా బాధ్యతలు స్వీకరించిన డి.ప్రశాంత్‌కుమార్‌ను ఆదివారం దళిత ఐక్య వేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. అట్రాసిటీ చట్టాన్ని అమలుచేయాలని కోరారు. ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, పెయ్యల శ్రీనివాసరావు, కుంచే చంటి, గెద్దాడ బుద్ధరాజ్, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, మెండు సురేష్ పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం: ఎమ్మెల్యే దేవ




ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

మలికిపురం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలవడమే తమ ధ్యేయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్‌మార్కు వద్ద గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌కు, నీటి సంఘాల అధ్యక్షులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవ మాట్లాడుతూ గత పాలకుల హయాంలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందన్నారు. వ్యవసాయ నీటిపారుదల కాల్వలు, మురుగునీటి కాల్వలు నిర్లక్ష్యానికి గురై కాల్వల్లో చెత్త పేరుకుపోయి రైతులకు నీరు అందని దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వాటన్నింటినీ మెరుగుపరిచి శివారు ప్రాంత రైతులకు కూడా సాగునీరు అందించడానికి ముందుకు వెళతామన్నారు. డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పట్టుదలతో బీసీ సామాజిక వర్గానికి చెందిన తనను ప్రాజెక్టు చైర్మన్‌గా ఎంపిక చేశారని ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని పదకొండు నీటిసంఘాల అధ్యక్షులను, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లను సన్మానించారు. మాజీ శాసనసభ్యులు ఎంవే వేమా, గుండుబోగుల పెద్దకాపు, డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, అడబాల యుగంధర్, గుబ్బల ఫణి, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, దొడ్డా జయరామ్ పాల్గొన్నారు.

రైతులు శిస్తు చెల్లించాలి

అంతర్వేది, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన భూములను కౌలుకు చేస్తున్న కౌలు రైతులతో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఆదివారం సమావేశమయ్యారు. ప్రధానంగా శిస్తు చెల్లించని రైతులతో ముఖాముఖిగా చర్చించారు. తక్షణమే శిస్తు చెల్లించాలని, చేపలు, రొయ్యలు చెరువులు సాగు చేస్తున్న ఆక్వా రైతులు శిస్తు పెంచాలని కోరడంతో రైతులు కొన్నిరోజులు గడువు కోరారు. ఆలయ అధికారులు వారం గడువు ఇచ్చి ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా రైతులు శిస్తు చెల్లించి రశీదు పొందాలన్నారు. రైతు సంఘం నాయకులు చెల్లుబోయిన కేశవశెట్టి, నల్లి బుజ్జిబాబు, కౌలు రైతులు పాల్గొన్నారు.

యోగా నారాయణకు డాక్టరేట్



మామిడికుదురు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): యోగా నారాయణగా ప్రసిద్ధి పొందిన పాశర్లపూడి గ్రామానికి చెందిన మల్లాడి వీరవెంకటసత్యనారాయణకు డాక్టరేట్ లభించింది. యోగావిజ్ఞానాన్ని దేశ విదేశాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నారాయణ సేవలు గుర్తించి ఏషియా ఇంటర్నేషనల్ రీసెర్చ్ యూనివర్శిటీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈనెల28న దక్షిణ భారతదేశంలోని యూనివర్శిటీ నిర్వహించే కాన్వకేషన్ కార్యక్రమంలో డాక్టరేట్‌ను అందుకోనున్నారు. ఆయన్ను మిత్రులు చింతా మహానాగరాజు, ఇల్లింగి వెంకటరమణ, తిరుమాని ఆచార్యులు తదితరులు అభినందించారు.

స్వామివారి ఆలయంలో ఆర్డీవో మాధవి పూజలు

అంతర్వేది, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదివారం విచ్చేశారు. ఆమెకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించారు. వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఆమెకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామరాజు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం రాజేష్‌పాటిల్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించారు. వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం సీజీఎం రాజేష్‌పాటిల్‌కు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

రక్తపింజర పాము హల్‌చల్

ముమ్మిడివరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగరపంచాయతీ మల్లాయిపాలెంలో రెడ్డి వెంకటేశ్వరరావు పొలంలో రెండు రక్తపింజర పాములు హల్‌చల్ చేయడంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో వాటిని స్నేక్‌క్యాచర్ బంధించి అటవీ ప్రాంతానికి తరలించారు.

ప్రధాన పంటకాల్వలో మహిళ మృతదేహం లభ్యం

పి.గన్నవరం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం శివారు మొండెపులంక లాకు సమీపంలో వంతెన వద్ద మహిళ మృతదేహం లభ్యమైంది. పి.గన్నవరం శివారు బాలయోగికాలనీకి చెందిన దొంగ ఆనందరావు ఆరు నెలలు క్రితం మృతిచెందాడు. భర్త మృతితో చిరంజీవిని(54) కొన్ని రోజులుగా మానసికంగా బాధ పడుతుంది. 3రోజులు క్రితం ఆమె బొంబాయి వెళ్లి పోతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. వంతెన వద్ద చిరంజీవిని మృతదేహం లభ్యమైంది. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం : ఎమ్మెల్యే దేవ

మలికిపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ క్రీస్తు బోధనలు ఆచరించడం ద్వారా మంచిగా మెలగవచ్చునని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం మోరిపోడులో క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రీస్తు శాంతి కోసం బోధనలు చేశారని, వాటిని ప్రతీఒక్కరూ ఆచరిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. కొవిడ్ సమయంలో రివర్ సైడ్ ఆసుపత్రి ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో డార్విన్, మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి త్రివేణి, గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

పండు కుటుంబానికి రూ.50వేలు సాయం

అమలాపురంరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జనసేన చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు నాగపుల్లేశ్వరరావు (పండు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ ఇటీవల బండారులంకలో పండు కుటుంబాన్ని పరామర్శించి అమలాపురం జనసైనికుల సమకూర్చిన రూ.12వేలు అందించారు. అదేరోజున పండు కుటుంబ సభ్యులను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు ఫోన్‌లో పరామర్శించి రూ.50వేలు అందజేయనున్నట్టు ప్రకటించారు. ఆ మొత్తాన్ని నియోజకవర్గ జనసేన నాయకులకు పంపించగా ఆదివారం నల్లా శ్రీధర్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, లింగోలు పండు, ఆర్డీఎస్ ప్రసాద్, నల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను బిందెతో తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం జరిపారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,56,165 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కొత్తగూడేనికి చెందిన బోయినపల్లి రామచంద్రరావు, సునీత దంపతులు రూ.1,00,121 విరాళం ఇచ్చారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందించారు.

ఊడిమూడిలో మెగా ఉచిత వైద్య శిబిరం

కె.గంగవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊడిమూడి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దీన్ని ప్రారంభిం చారు. ఈ శిబిరంలో విశాఖకు చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్, పవర జంక్షన్ ట్రినిటీ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి, పిఠాపురం సీఎంసీ కంటి ఆసుపత్రి, హాసిని, భీమేశ్వర దంత వైద్యశాల, సోము దుర్గాప్రసాద్ చారిటబుల్ ట్రస్టు, లక్ష్మీ ఆప్టికల్స్ రోగులకు ఉచితంగా పలు రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. దీన్ని తాడాల బుజ్జి ఆధ్వర్యంలో పలు వైద్యశాలల సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు క్రాంతి కుమార్, మడక రాం బాబు, తన్మయ్ తదితరులు రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్ తదితరులతో పాటు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్



కొత్తపేటలో గణితం హెచ్‌వోడీ భూపాల్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీరాజు

విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కొత్తపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రీనివాస్ రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. ఆదివారం రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కేపీ రాజు అధ్యక్షతన వేడుకలు జరిపారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. తణుకు ఎస్వీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణితం హెచ్‌వోడీ ఆర్ఎస్ఎం భూపాల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీసీహెచ్ పాపారావు, ఏ.నాగజ్యోతి, డి.రమాదేవి, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిపారు. గణితశాస్త్ర అధ్యాపకుడు బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామానుజన్ గురించి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో గణితశాస్త్ర అధ్యాపకుడు కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధ్యాపకులు ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు, కూటమి నాయకులు

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం

రావులపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కూటమి శ్రేణులతో కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, సయ్యపురాజు రామకృష్ణంరాజు, పెచ్చెట్టి చిన్నారావు, సిద్ధిరెడ్డి శ్రీను, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



అకాడమి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలైన చిన్నారులు

'ఘనంగా మదర్‌థెరిసా వార్షికోత్సవం'

మండపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వున్న మదర్‌థెరిసా ఫైనార్ట్స్ అకాడమి వార్షికోత్సవాన్ని నాళం చినబీమయ్య సత్రంలో ఆదివారం జరిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రం నలమూలల నుంచి వచ్చిన వారికి డ్రాయింగ్, సంగీతం, మెహందీ, తెలుగు సంప్రదాయ దుస్తులు, మోడల్ హెయిర్ స్టయిల్ తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు అకాడమి తరపున బహుమతులు అందించారు. వృద్ధులు, వితంతువులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లను అందించారు. ఇటీవల ఎన్టీఆర్ చిత్రాన్ని 100 రూపాయల నాణంపై ముద్రించిన బాలిక శైలజరెడ్డి, సినీ పరిశ్రమలో రాణిస్తున్న విజయనాగ లలితలను అకాడమి తరపున సత్కరించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ మందపల్లి సత్యానందం, కె.రామ్మోహన్, సాధా రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీవీరావు సేవలు మరువలేనివి

కపిలేశ్వరపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాలల ఐక్యతకు కృషి చేసిన పీవీరావు సేవలు మరువలేనివని పలువురు మాలమహానాడు నాయకులన్నారు. ఆదివారం మండలంలోని పడమరఖండ్రికలో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, పీవీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాలంగి కృష్ణ కిషోర్, మాలమహానాడు నాయకులు నేల రాంబాబు, నేతల సురేష్‌బాబు, కొత్తపల్లి వినోద్, మోర్త వెంకటేష్, కోనాల సురేష్, బడుగు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పడమరఖండ్రికలో అంబేడ్కర్, పీవీ రావుకు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

జొన్నాడ-మండపేట రోడ్డుకు మోక్షం

ఆలమూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అధ్వాన్నంగా మారిన జొన్నాడ-మండపేట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుదీర్ఘ కాలంపాటు ఈ రోడ్డుకు నిధులు మంజూరు కాకపోవడంతో భారీ గోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జొన్నాడ నుంచి గుమ్మిలేరు వరకు రూ.70 లక్షలు, గుమ్మిలేరు నుంచి మండపేట వరకు రూ.60 లక్షల నిధులు మరమ్మతులకు కేటాయించారు. ఈ నిధులతో గత వారం భారీ గోతులను పూడ్చారు. ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులుగా ఉన్న ప్రాంతాల్లో బీటీ రోడ్డును నిర్మిస్తున్నారు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కొత్తూరు నుంచి వెదురుమూడి రోడ్డుకు మరమ్మతుల నిమిత్తం నిధులు మం జూరు కావడంతో టెండర్ ఖరారవగా, బీటీ పనులు మొదలు పెట్టాల్సి ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



జొన్నాడ-మండపేట రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం



మడికిలో అయోడిన్ లోపంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అయోడిన్ లోపంతో శారీరక, మానసిక సమస్యలు

ఆలమూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆహారంలో అయోడిన్ లోపం వల్ల శారీరక, మానసిక సమస్యలు ఏర్పడతాయని కళాజాతాల ద్వారా అవగాహన కల్పించారు. మండలంలోని మడికి, చొప్పెల్ల, నర్సిపూడి గ్రామాలలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఐటీసీ అధ్వర్యంలో ఆదివారం అవగాహన కల్పిస్తూ బుర్రకథలు నిర్వహించారు. అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతలను వారు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఓఆర్‌డబ్ల్యు ఎస్.సునీత తెలిపారు.



అర్తమూరులో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అర్తమూరులో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మండపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం అర్తమూరులో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టారు. గ్రామానికి మూడు వైపులా రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలను పంచాయతీ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి, పంచాయతీ సభ్యులతోపాటు కార్యదర్శి అనిల్, సచివాలయ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగించారు. గ్రామంలో చెత్త వేసేందుకు స్థలం కొరత కారణంగా రోడ్డుపక్క చెత్త వేయాల్సి వస్తున్నదని కార్యదర్శి చెప్పారు. ఇక నుంచి రోడ్డుపక్క చెత్త వేయబోమని, ఎవరైనా చెత్త వేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రోడ్డుకు మూడు వైపులా చెత్త తొలగింపుతో వాహనదారులకు కంపు సమస్య తొలగడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జనసేన ప్రమాద బీమా చెక్కులను అందిస్తున్న బండారు శ్రీనివాస్

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ

ఆలమూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జనసేన సభ్యత్వం తీసుకున్న ప్రతి జనసైనికుడికి ప్రమాదబీమా ఆర్థిక భరోసా కల్పిస్తుందని కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. ఆలమూరులో ఆదివారం ప్రమాద బీమా చెక్కులను అందించారు. ప్రమాదంలో గాయపడిన ఆలమూరుకు చెందిన చిన్నం వీరబాబుకు రూ.50వేలు, పెట్టా రంగనాథ్‌కు రూ.32వేలు చెక్కులను అందించారు. వీరికి సభ్యత్వాలు నమోదు చేసిన వలంటీర్లు బి.రాంబాబు, ఎస్.పట్టాభిలను అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, జన సైనికులు సలాది జయప్రకాష్ నారాయణ, గారపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తాపేశ్వరంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి తదితరులు

యుగ పురుషుడు ఎన్టీఆర్

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): యుగ పురుషుడు దివంగత ఎన్టీఆర్ అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, సీఎం ప్రోగ్రాం కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ అన్నారు. మండపేట మండలం తాపేశ్వరం సెంటరులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ చిత్రపరిశ్రమతోపాటు రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఘనత కూడా ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణులను వారు అభినందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డిప్రసాద్, మాజీ ఎంపీపీలు గోసాల సుజాత, తాపేశ్వరం గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి, అర్తమూరు ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి, పితాని వేంకటేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎన్.వీర్రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, టీడీపీ నేతలు నూని వీర్రాజు, మత్యాల సత్యనారాయణ, పట్టాభి తదితరులతోపాటు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

క్రిస్మస్ వేడుకలు

రావులపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈతకోట పరిధిలో ఉన్న ఒలివల ప్రార్థన మందిరంలో పాస్టర్ పమ్మి అమృతరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గిడ్డి ఆనంద్, పాస్టర్ లూకా, సత్యానందం, మధుబాబు, శాంతికిరణ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, సర్పంచ్‌లకు పరామర్శ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవానీ, కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి, వైసీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ఇటీవల ఎంపీపీ అమ్మమ్మ జానకమ్మ మృతి చెందారు. దీంతో ఎంపీపీ భవానీ, అంబటి నెహ్రూ, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారంలను ఆయన పరామర్శించారు.

మున్సిపల్ చీఫ్‌విప్‌కు పరామర్శ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చీఫ్‌విప్ వాడ్రేవు సాయిప్రసాద్‌ను ఆదివారం మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ఇటీవల వాడ్రేవుసాయి ప్రసాద్ తల్లి సుబ్బలక్ష్మి మృతి చెందారు. మాతృవియోగం పొందిన సాయిప్రసాద్, ఆయన సోదరుడు ఉపాధ్యాయ సంఘం నేత వాడ్రేవు శ్రీనివాస్‌ను ఆయన పరామర్శించారు. న్యాయవాదులు చోడి జాన్‌రత్నం, అంగర గోపి, బినయ్‌బాబులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



మండల అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్

ఆలమూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా అద్దరి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జి.పుత్రకుమార్, సీహెచ్ఎస్‌వీజీ.శ్యామల, ప్రధాన కార్యదర్శిగా బి.లోకేష్, కోశాధికారిగా బీఎస్‌మూర్తితో పాటు పలువురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్‌కి జీవీ జోగేశ్వరరావు, వైవీవీ రమణ, పీవీవీఎస్ఎన్ మూర్తి, ఈ.రమేష్, అద్దరి శ్రీనివాసరావు, బి.లోకేష్‌లను ఎంపిక చేశారు.



పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న జనసేన పార్టీ నాయకులు

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

కపిలేశ్వరపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కొంపెల్ల రాంబాబుశర్మ, జనసేన గ్రామ ఉపాధ్యక్షుడు తోరాటి శ్రీను సౌజన్యంతో అంగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వీటిని అందజేశారు. జనసేన ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సేవలను ఆదర్శంగా తీసుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పిల్లా బసవరాజు, దానేటి శరత్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి ఆలయంలో ఆర్డీవో మాధవి పూజలు

అంతర్వేది, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదివారం విచ్చేశారు. ఆమెకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించారు. వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఆమెకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామరాజు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం రాజేష్‌పాటిల్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించారు. వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం సీజీఎం రాజేష్‌పాటిల్‌కు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

రక్తపింజర పాము హల్‌చల్

ముమ్మిడివరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగరపంచాయతీ మల్లాయిపాలెంలో రెడ్డి వెంకటేశ్వరరావు పొలంలో రెండు రక్తపింజర పాములు హల్‌చల్ చేయడంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో వాటిని స్నేక్‌క్యాచర్ బంధించి అటవీ ప్రాంతానికి తరలించారు.



వెదురుపాక విజయదుర్గా అమ్మవారు

26 నుంచి పీఠంలో పవిత్రోత్సవాలు

రాయవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 26, 27, 28 తేదీల్లో విజయదుర్గా అమ్మవారికి పవిత్రోత్సవాలు వైఖానస సంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రవిత్రోత్సవాల్లో భాగంగా విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు, హోమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బి.రమ, పెద్దపాటి సత్య కనకదుర్గ, పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

5న చలో విజయవాడను విజయవంతం చేయండి

కె.గంగవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరిగే సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల యువమోర్చా అధ్యక్షుడు పి.శ్రీరామ్ మణికంఠ కోరారు. ఆదివారం ఊడిమూడిలో జరిగిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ కోటిపల్లి సుబ్బారావు, తాడాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అంతరించిపోతున్న కళలను బతికిద్దాం

ఆత్రేయపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంతరించుకుపోతున్న కళలను బతికించాలన్న ఉద్దేశంతో అనూష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కళలను బతికిస్తున్న కళాకారులను ఆదివారం సత్కరించారు. మ్యాజిక్ హౌస్‌లో సంక్రాంతి సందర్భంగా కళాకారులను బతికించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియచేస్తూ వివిధ రంగాల కళాకారులను పలు వురు సత్కరించారు. కార్యక్రమంలో చింతా శ్యామ్‌కుమార్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.